క్లుప్తంగా

మట్టి నమూనాల సేకరణ



పరిశీలిస్తున్న రాజకుమార్

ఇందుకూరుపేట: మండలంలోని పాములవారిపాళెంలో గల పొలాల్లో మట్టి నమూనాలను సహాయ వ్యవసాయ సంచాలకుడు రాజకుమార్ ఆధ్వర్యంలో సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో 450.. సబ్ డివిజన్లో 1950 మట్టి నమూనాలను సేకరిస్తున్నారని వివరించారు. నమూనాలను సేకరించే సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు. స్థానిక వ్యవసాయాధికారి రఘునాథరెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు మాదయ్య, ఝాన్సీ, దీక్షిత తదితరులు పాల్గొన్నారు.

రమేష్‌బాబు సేవలు అభినందనీయం



రమేష్‌బాబుకు సత్కారం

కోవూరు: ఉపాధ్యాయుడు రమేష్‌బాబు సేవలను ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు జుల్ఫికర్ అలీ అహ్మద్ అభినందించారు. పాటూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు రమేష్‌బాబు ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అలీ అహ్మద్ మాట్లాడారు. 38 ఏళ్లకుపైగా విద్యార్థులకు బోధిస్తూ.. పొదలకూరు, కోవూరు తదితర మండలాల్లో పనిచేశారని చెప్పారు. అనంతరం ఆయన్ను సత్కరించారు. ఉపాధ్యాయులు పర్వతరెడ్డి జనార్దన్‌రెడ్డి, కాలేబు, భీమతాటి వెంకటరమణయ్య, మార్లెళ్ల చంద్రమోహన్, పోలోజీ వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆటోలతో ట్రాఫిక్ కష్టాలు



పొదలకూరు: మనుబోలులో ఆటోల సంఖ్య నానాటికీ అధికమవుతోంది. వీటి కారణంగా వైఎస్సార్ సర్కిల్ వద్ద తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఆర్టీసీ బస్సులు తక్కువగా ఉండటం.. సమయపాలన పాటించకపోవడంతో ప్రతి చిన్న పనికీ ఆటోలపైనే ప్రయాణికులు ఆధారపడాల్సి వస్తోంది. మనుబోలు నుంచి మండలంలోని చెర్లోపల్లి, పిడూరు, యాచవరం, బండేపల్లి, మడమనూరు, వీరంపల్లి, అక్కంపేట తదితర గ్రామాలకు బస్సు సౌకర్యం సక్రమంగా లేదు. దీంతో ఈ గ్రామాలకు వెళ్లాలంటే ఆటోలే దిక్కవుతున్నాయి. ప్రస్తుతం మనుబోలులో దాదాపు 50కుపైగా ఆటోలు ఉన్నాయి. ఆటోల రద్దీకి తోడు కోదండరామపురంలో పలు దుకాణాలు రోడ్డుపైకి చొచ్చుకొచ్చాయి. దీంతో రోడ్డు కుచించుకుపోయి ట్రాఫిక్‌కు సమస్య తలెత్తుతోంది.

డయేరియా నివారణ చర్యలపై అవగాహన

కొడవలూరు: పరిశుభ్రత లోపిస్తే డయేరియా ముప్పు పొంచి ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగభూషణమ్మ పేర్కొన్నారు. డయేరియా నివారణ చర్యలపై మండలంలోని నార్తురాజుపాళెం సీబీఎన్ కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్‌హెచ్‌పీ స్నేహ మాట్లాడారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను తప్పక పాటించాలని కోరారు. అనంతరం సబ్బుతో చేతులను శుభ్రపరుచుకోవడాన్ని వివరించారు. ప్రధానోపాధ్యాయురాలు క్యాథరిన్, ఉపాధ్యాయులు శ్రీలక్ష్మి, ఏఎన్ఎం సలోమి, అంగన్‌వాడీ కార్యకర్తలు విజయమ్మ, సునీత, సుదర్శనమ్మ, భారతి, మంజుల పాల్గొన్నారు.

విత్తన తయారీ కేంద్రంలో తనిఖీలు



కొడవలూరు: మండలంలోని యల్లాయపాళెం మజరా దాసరిపాళెం వద్ద గల వరి విత్తన ప్రాసెసింగ్ ప్లాంట్‌ను పొదలకూరు ఏడీఏ శివనాయక్‌తో కూడిన విత్తన తనిఖీ బృంద సభ్యులు శుక్రవారం తనిఖీ చేశారు. ప్లాంట్‌లో రిజిస్టర్ల నిర్వహణ, విత్తన నిల్వలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం శివనాయక్ మాట్లాడారు. అన్ని రకాల విత్తనాలను ఎమ్మార్పీకే విక్రయించాలని ఆదేశించారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతుల సంతకాలను విధిగా తీసుకోవాలన్నారు. వీటిని పాటించకపోతే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కొడవలూరు, విడవలూరు, బుచ్చిరెడ్డిపాళెం ఏఓలు లక్ష్మి, వెంకటకృష్ణయ్య, సురేంద్రరెడ్డి, వీఏఏ ఉమామహేష్ పాల్గొన్నారు.

నీరు పారేదెలా..?

నగరంలోని ముత్తుకూరు గేట్ సమీపంలో గల సర్వేపల్లి కాలువలో నీటి పారుదలకు ఆటంకం ఏర్పడుతోంది. చెత్తాచెదారం ఇప్పటికే పేరుకుపోగా, తాజాగా పచ్చిగడ్డి ఏపుగా పెరిగి ప్రవాహానికి ప్రతిబంధకంగా మారుతోంది. సంబంధిత అధికారులు వీటిని తొలగించేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు





లాడ్జీల్లో ఆకస్మిక తనిఖీలు

నెల్లూరు(క్రైమ్): నేర నియంత్రణ.. అసాంఘిక కార్యకలాపాల కట్టడి చర్యల్లో భాగంగా లాడ్జీల్లో ఆకస్మిక తనిఖీలను పోలీస్ అధికారులు గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు నిర్వహించారు. లాడ్జీల్లో బస చేసిన వ్యక్తుల నుంచి వివరాలను సేకరించారు. అనంతరం రిసెప్షన్ కేంద్రంలో నిర్వహణ రికార్డులను పరిశీలించారు. బస చేసే వ్యక్తుల పూర్తి వివరాలు, ఆధార్‌ను విధిగా తీసుకోవాలని, వారి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉంటే స్థానిక పోలీసులకు తెలియజేయాలని సూచించారు. లాడ్జీ, పరిసరాలు స్పష్టంగా కనిపించేలా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు.



రికార్డులను పరిశీలిస్తున్న కోవూరు ఎస్సై రంగనాథ్‌గౌడ్

నిందితులపై చర్యలు చేపట్టాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి ప్రభుత్వ భూమిలో పట్టాలు సృష్టించిన వారిపై చర్యలు చేపట్టాలని సీపీఐ నగర కమిటీ నేత వాటంబేటి నాగేంద్ర డిమాండ్ చేశారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. నగరంలోని ఇరుగాళమ్మ సంఘం వద్ద గల 85 సెంట్ల ప్రభుత్వ భూమికి సంబంధించి అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి లేఅవుట్ వేసినా స్పందించకపోవడం దారుణమన్నారు. వీరిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు అధికారులపై శాఖాపరమైన చర్యలు చేపట్టాలని చెప్పారు. నేతలు లీలామోహన్, సతీష్, లజపతిరాయ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ నేతలు

పీడీఎస్‌యూ నేతల ఆందోళన

నెల్లూరు (టౌన్): నీట్ పరీక్షలో అవకతవకలు చోటుచేసుకున్న తరుణంలో పరీక్షను రద్దు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సునీల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ముత్తుకూరు రోడ్డు సెంటర్‌లో ఆందోళనను పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేపర్ లీకేజీకి కారణమైన ఎన్టీఏ సంస్థను రద్దు చేయాలని కోరారు. సమగ్ర దర్యాప్తు చేసి అక్రమాలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించడంతో పాటు నీట్ పరీక్షను రద్దు చేసి మరోసారి నిర్వహించాలని చెప్పారు. పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు షారూఖ్, నేతలు ఆశిర్, ఖాదర్ బాషా, మనోజ్, వంశీ పాల్గొన్నారు.



అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

నెల్లూరు(క్రైమ్): అంకితభావంతో విధులు నిర్వర్తించాలని ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ పేర్కొన్నారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ వెల్ఫేర్ డేను శుక్రవారం ఆయన నిర్వహించారు. వివిధ సమస్యలపై అర్జీలను సిబ్బంది అందజేశారు. వీటిని పరిశీలించి సత్వరమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఏఎస్పీ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆరిఫ్ హాఫీజ్

విద్యా సామగ్రి పంపిణీ

నెల్లూరు సిటీ: కోడూరుపాడులోని జెడ్పీ ప్రాథమిక పాఠశాలలో నోట్ పుస్తకాలు, పలకలు, పరీక్ష ప్యాడ్లు, పెన్సిళ్లను తోట శివకుమార్, సాయి ప్రవీణ్ శుక్రవారం పంపిణీ చేశారు. ఎంఈఓ మురళీధర్, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు సురేంద్రబాబు, ఉమాదేవి, ఆదిశేషారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శివకుమారి తదితరులు పాల్గొన్నారు.



శేషవాహనంపై విహరించిన మహావిష్ణు



నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని అయ్యప్ప దేవస్థాన ప్రాంగణంలో గల మహాలక్ష్మి గోదా సమేత గురువాయూర్ మహావిష్ణు ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలను వేడుకగా నిర్వహిస్తున్నారు. స్వామివారు ఉభయదేవేరులతో సర్వాలంకారశోభితంగా కొలువై శేషవాహనంలో శుక్రవారం విహరించారు. శీవేలి ఉత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. భద్రాచలంలోని సీతారామచంద్ర స్వామి దేవస్థాన స్థానాచార్యుడు శ్రీమాన్ కొమాండూరు ఇళైయవిల్లి స్థలశాయి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను జరిపారు. మహాకుంభారాధన, నిత్యహోమం నివేదన, శాత్తుమొరైను సాయంత్రం నిర్వహించారు. ఉభయకర్తలుగా చేబోలు సురేంద్ర, సురేఖ, గడ్డం రత్నయ్య, సుజాత, జగన్నాథం, పద్మజ, విష్ణుతేజ, శ్రీనివాస్, భార్గవి వ్యవహరించారు. అయ్యప్ప సేవా సమాజ నిర్వాహకులు శేషగిరిరావు, వెంకటరత్నం, మోహన్‌రావు, శంకరన్ తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో చోరీ

నెల్లూరు సిటీ: వడ్డిపాళెంలోని రామాలయంలో బంగారం, నగదును గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాత్రి చోరీ చేశారు. పోలీసుల వివరాల మేరకు.. సీతమ్మ మెడలోని మూడు గ్రామల కాసులు, తాళిబొట్టును దుండగులు దోచుకెళ్లారు. హుండీలోని సుమారు రూ.50 వేల నగదు చోరీకి గురైందని సమాచారం. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కానరాని విజిబుల్ పోలీసింగ్

నెల్లూరు(క్రైమ్): విద్యాసంస్థల వద్ద విజిబుల్ పోలీసింగ్ జాడ కనుచూపు మేరలో కనపడటం లేదు. ఈవ్ టీజింగ్, అల్లరిమూకల ఆగడాలను కట్టడి చేసేందుకు గానూ విద్యాసంస్థల వద్ద విజిబుల్ పోలీసింగ్‌ను రోజూ సాయంత్రం నిర్వహించాలని ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ ఇటీవల ఆదేశించారు. మరుసటి రోజు పోలీస్ అధికారులు తమ స్టేషన్ పరిధిలోని కళాశాలలు, పాఠశాలల వద్ద విజిబుల్ పోలీసింగ్‌ను నిర్వహించి ఫొటోలు తీసుకొని జిల్లా పోలీస్ గ్రూప్‌లో అప్‌లోడ్ చేసి మమ అనిపించారు. దీంతో ఎస్పీ ఉద్దేశం నీరుగారుతోంది.

గోదాములో చోరీ

నెల్లూరు(క్రైమ్): గోదాము తాళాలను గుర్తుతెలియని దుండగులు పగలగొట్టి క్యాష్ కౌంటర్‌లో ఉన్న రూ.లక్షను దోచుకెళ్లిన ఘటన హరనాథపురం రెండో వీధిలో శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. హరనాథపురానికి చెందిన గురుమూర్తి స్వీట్ షాపులు, బేకరీలకు రా మెటీరియల్‌ను సరఫరా చేస్తుంటారు. హరనాథపురం రెండో వీధిలో ఆయనకు గోదాము ఉంది. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు గోదాము తాళాలను పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. లోపల, బయట ఉన్న సీసీ కెమెరాలను ధ్వంసం చేసి సమీపంలోని కాలువలో పడేశారు. అనంతరం క్యాష్ కౌంటర్‌లోని రూ.లక్ష, డీవీఆర్‌ను అపహరించుకెళ్లారు. శుక్రవారం ఉదయం వచ్చిన బాధితుడు చోరీ విషయాన్ని నిర్ధారించుకొని బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని చోరీ తీరును పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగుతున్న కృష్ణ కథామృత సప్తాహం

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో కృష్ణ కథామృత భాగవత సప్తాహాన్ని పద్యసారస్వత పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గోవర్ధనోద్ధరణం అనే అంశంపై విడవలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ ఐనవోలు శ్రీనివాస చక్రపాణి శుక్రవారం ఉపన్యసించారు. సభాపోషకుడిగా ఇనమనమెళ్లూరు నాగరాజారావు వ్యవహరించారు. అనంతరం శ్రీనివాస చక్రపాణిని సత్కరించారు. శతావధాని కొండపి మురళీకృష్ణ, సూరం చంద్రశేఖరం, చక్కిరాల జయప్రసాద్, అన్నవరం సత్యనారాయణ, కోట శ్రీరామ్మూర్తి, తంగిరాల నరసింహకుమార్, దేవరకొండ మురళీకృష్ణ, సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు పోలవరపు లక్ష్మీనరసింహరావు, చీమకుర్తి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు రేపు

నెల్లూరు(బృందావనం): నగరంలోని పుర మందిరంలో శాస్త్రీయ నృత్యప్రభంజనం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించనున్నామని సృజన సాహిత్య, సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు దగ్గుపాటి రాధాకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 120 మంది కళాకారులతో నృత్య ప్రదర్శనలు.. బాలాజీనగర్‌లోని సాయిదర్బార్ అద్దాల మందిర కోలాట బృంద ఆధ్వర్యంలో కోలాట ప్రదర్శనలను నిర్వహించనున్నామని వివరించారు. సినీ సంగీత విభావరితో పాటు నగరంలోని శాస్త్రీయ నృత్య గురువులను సత్కరించనున్నామని చెప్పారు. భారీగా తరలిరావాలని కోరారు.

'విశాలాక్షి' వార్షికోత్సవం రేపు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): విశాలాక్షి మాసపత్రిక 15వ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నారని 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ఇస్కాన్ సిటీలో గల కళాసంఘాల స్టూడియోలో ఆహ్వాన పత్రికలను శుక్రవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. పురమందిర ప్రాంగణంలోని ఏసీ హాల్లో కార్యక్రమాన్ని నిర్వహించనున్నారని వివరించారు. విశాలాక్షి వృద్ధాశ్రమాన్ని స్థాపించి తన సేవలతో కోసూరు రత్నం ఎందరో ప్రశంసలను అందుకున్నారని చెప్పారు. విశాలాక్షి సాహిత్య మాసపత్రికను స్థాపించి సాహితీరంగానికి అందిస్తున్న సేవలను అభినందించారు. సంపాదకుడు ఈతకోట సుబ్బారావు, విశ్రాంత తహసీల్దార్ దంపూరు రామకృష్ణ, రచయిత్రి నాగ గాయత్రి, కళాసంఘాల కన్వీనర్లు దోర్నాల హరిబాబు, నేదురుమల్లి హరనాథ్‌రెడ్డి, భాస్కర్, అమీర్‌జాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆఫ్‌లైన్ సేవలను కొనసాగించరూ..

నెల్లూరు(అర్బన్): ఎల్ఐసీలో రూ.రెండు లక్షల్లోపు పాలసీలను ప్రస్తుత తరహాలోనే ఆఫ్‌లైన్లో కొనసాగించాలని ఎల్ఐసీ ఏఓఐ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాజశేఖర్ కోరారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన నెల్లూరు డివిజన్ కెరీర్ ఏజెంట్ల బ్రాంచ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.రెండు లక్షల్లోపు పాలసీలను సెప్టెంబర్ నుంచి ఆఫ్‌లైన్ ద్వారా కాకుండా ఆన్‌లైన్ ద్వారా మాత్రమే ఏజెంట్లు ప్రజలకు అందించేలా నిర్ణయం తీసుకోవడం సరికాదని సూచించారు. పాతవారిలో అనేక మంది పది, ఇంటర్ చదువుకున్న వారున్నారని, ఆన్‌లైన్లో ఇంగ్లిష్‌లో పాలసీలను ప్రజలకు అందించాలంటే కష్టమని చెప్పారు. పాలసీలకు ఇప్పుడు ప్రకటిస్తున్న బోనస్‌ను పెంచాలని కోరారు. అనంతరం రాష్ట్ర నేతలు రాజశేఖర్, మేకల నరసింహరావు తదితరులను సత్కరించారు. సీడబ్ల్యూసీ సభ్యుడు దేవరకొండ శ్రీనివాసులు, డివిజనల్ సెక్రటరీ నరసింహరావు, జాయింట్ సెక్రటరీ రషీద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నేతలు

ఆప్రాన్‌కు మరమ్మతులను చేపట్టాలని వినతి



నెల్లూరు(దర్గామిట్ట): సోమశిల ప్రాజెక్ట్‌కు మూడేళ్ల క్రితం వచ్చిన వరదల కారణంగా ఆప్రాన్ పూర్తిగా దెబ్బతినిందని, మరమ్మతులను వెంటనే చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ జిల్లా కమిటీ నేతలు కోరారు. ఈ మేరకు సోమశిల ప్రాజెక్ట్ సూపరింటెండెంట్ ఇంజినీర్ వెంకటరమణారెడ్డికి వినతిపత్రాన్ని శుక్రవారం అందజేసిన అనంతరం వారు మాట్లాడారు. పది లక్షల ఎకరాల ఆయకట్టు కలిగి.. నెల్లూరు, చిత్తూరు, చెన్నై ప్రాంతాలకు సాగు, తాగునీటిని అందించే ఈ బృహత్తర ప్రాజెక్ట్ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. సోమశిలకు మరోసారి వరదొస్తే ప్రాజెక్ట్‌కు చాలా ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని, ఈ క్రమంలో ఆప్రాన్ పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. సంఘ రాష్ట్ర కార్యదర్శి దామా అంకయ్య, సభ్యులు హనుమారెడ్డి, గంగపట్నం రమణయ్య, షానవాజ్ పాల్గొన్నారు.

ఘనంగా రోటరీ క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

నెల్లూరు(బృందావనం): రోటరీ క్లబ్, నెల్లూరు నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలోని రోటరీ క్లబ్ ఆడిటోరియంలో శుక్రవారం రాత్రి నిర్వహించారు. అధ్యక్షుడిగా బెజవాడ నరేష్‌చంద్రారెడ్డి, కార్యదర్శిగా అఖిలేష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఉదయభాస్కర్‌రావు, సహాయ కార్యదర్శిగా రమణారెడ్డి, కోశాధికారిగా రవీంద్రనాథ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమ నిర్వహణాధికారిగా విశ్వనాథ్ వ్యవహరించారు. దొడ్ల భరత్‌కుమార్‌రెడ్డి, మునిగిరీష్ తదితరులు పాల్గొన్నారు.



నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని పలు సబ్‌స్టేషన్లలో మరమ్మతులు, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శనివారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ సోమశేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

- నవాబుపేట రైతుబజార్ సబ్‌స్టేషన్ పరిధిలోని బోడిగాడితోట ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా బోడిగాడితోట, వీవర్స్ కాలనీ, లక్ష్మీపురం, సత్యనారాయణపురం, శ్రీనివాసనగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదన్నారు.
- నవాబుపేట మార్కెట్ యార్డ్ సబ్‌స్టేషన్ పరిధిలో గల మార్కెట్ యార్డ్ 11 కేవీ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా నవాబుపేట, నజీర్‌తోట, కుసుమ దళితవాడ, ముకుందపురం, పుల్లమ్మసత్రం తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట సరఫరా ఉండదని చెప్పారు.
- గోమతినగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని రామలింగాపురం ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా ముత్యాలపాళెం, రామలింగాపురం, మినీబైపాస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి 11 వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.
- వెంకటేశ్వరపురం సబ్‌స్టేషన్ పరిధిలోని టిడ్కో ఫీడర్‌లో మరమ్మతుల నేపథ్యంలో టిడ్కో గృహ సముదాయం తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి 11 గంటల వరకు సరఫరా ఉండదని తెలిపారు.
- ఆటోనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ జ్యోతినగర్ ఫీడర్‌లో తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న తరుణంలో జ్యోతినగర్, టీచర్స్‌కాలనీ, త్యాగరాజనగర్, వేదాయపాళెం తదితర ప్రాంతాల్లో ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 12 వరకు సరఫరా ఉండదని వివరించారు.

స్తంభించిన ట్రాఫిక్



కరెంటాఫీస్ రైల్వే గేట్ వద్ద ట్రాఫిక్ శుక్రవారం భారీగా స్తంభించింది. మరమ్మతుల నిమిత్తం కొండాయపాలెం రైల్వే గేట్‌ను జూలై మూడో తేదీ వరకు అధికారులు మూసేశారు. దీంతో వనంతోపు, బీవీనగర్, ఆర్టీఓ కార్యాలయం, కొండాయపాలెం తదితర ప్రాంత వాసులు కరెంటాఫీస్ రైల్వే గేట్ మీదుగా రాకపోకలు సాగించారు. దీంతో గేట్ నుంచి కేఏన్నార్ స్కూల్ వరకు.. కరెంటాఫీస్ సెంటర్ వరకు ట్రాఫిక్ స్తంభించింది.

– నెల్లూరు(క్రైమ్)